వచ్చారా? ఇంతవారని ఎప్పుడూ అనుకోలేదు. నెరజాణను తిన్నగా తీసుకురాలేక సామర్లకోటలో ఎక్కడో ఉంచారుగాబోలు. రాగానే అడుగుతాను. మాట్లాడ్డం మానేస్తే బాగుంటుందేమో. అని ఆలోచిస్తూండగానే వీధితలుపు తట్టిన చప్పుడు. సీత వెళ్ళి తలుపుతీసి పలకరించకుండా వెనక్కి వెళ్ళిపోయింది. కారణం గ్రహించలేక పోయాడు గణేశం. వెనక్కాలే వెళ్ళి పలకరించాడు. సంతృప్తికరమైన జవాబు రాలేదు సీతదగ్గరనుంచి.

'ఏంసీతా! అల్లాఉన్నావేమి'

'ఎలాఉన్నాను. మీకళ్ళకలా కనబడుతున్నానుగాబోలు ఒకళ్ళముందు'

'అంటే'

'నెరజాణముందు నేనెలాఉంటానుమరి'

'నెరజాణ తెచ్చానని ఎవరుచెప్పారు'

'చూసినవాళ్ళెవరేనా చెపుతారు. చెప్పడం తప్పా?'

'చెప్పడం తప్పులేదు. తేవడంతప్పులేదు. అన్నాడు గణేశం. నెరజాణ తెచ్చిననేరం తనదే అనుకున్నాడు. నెరజాణను చూపించి కోపోపశాంతి చెయ్యాలనుకున్నాడు! అంచేత "సీతా చూస్తావా! నెరజాణని'

'మీరేచూడండి నేచూడనక్కరలేదు.'

'మీఅన్నయ్య తీసికొస్తున్నాడు! రా?

'మాఅన్నయ్యా! ఏడీ! ఎక్కడకనపడ్డాడు?'

'సామర్లకోటలో కనబడితే తీసికొచ్చాను'

అంటూండగానే నెరజాణసహితంగా రామారావు వచ్చాడు. బండివాడు సామాన్లింట్లో పెడుతున్నాడు. రామారావు చేతులోనున్న 'నెరజాణ' తీసుకుని గణేశం సీతకిచ్చాడు. సీత సిగ్గుపడిపోయింది నెరజాణ అనేది పత్రిక అని గ్రహించలేకపోయినందుకు. వెనకటిసారి పూలదండ ఎవరో సీతకివ్వడం అందుపై గణేశం అలగడం; పూలదండ అనేది పత్రిక అని తెలుసుకుని పశ్చాత్తాపపడ్డం; నేడు గణేశం నెరజాణ నేరంచెయ్యడం, సీత సిగ్గుపడ్డం రామారావుకు చెప్పారు. ఉభయులూను. పూలదండ మోసానికి, నెరజాణ నేరానికి సరిపోయింది. అనుకునేవారు ఎప్పుడేనా వాళ్లు.

---

# విడె, విడె, విడె, విడె,

కె నిర్మల

ప్రసిద్ధికెక్కిన పల్లెటూళ్ళలో ఒకటిచాగల్లాడు. ఆఊళ్ళో ఒకధనిక కుటుంబం ఉంది. ఆకుటుంబానికి వ్యవసాయమే ముఖ్యవృత్తి. ఆయింటి యజమాని కొక్కడే కొడుకు అతని పేరు వీరయ్య. చాలాగారాబం అందుమూలాన ఆయింట్లో అతనిదే యిష్టం. వీరయ్యకు కాళ్ళుఎక్కడా వంగటం అంటూలేదు. ఎంచేతంటే నికాల్నయిన కారణం ఒకటే; చిన్నప్పటినుంచి తల్లితండ్రుల గారాబం అవటంచేతను, నివసించే పల్లెటూరు మోటుదనంచేత, అతడెక్కడనుంచున్నా, కూచున్నా, పడుకున్నా ఇటోకాలూ, అటోకాలూ చాచి తప్పకాళ్లు వంచి పైపనులు

చేయటం అతనికలవాటు లేదు. వానికీవంగటం అలవాటులేదు. ఎంచేతో కాని వీరయ్యకు పాతికేళ్ళొచ్చినా పెండ్లికాలేదు. మళ్ళీ తండ్రిప్రయత్నంలో ఏమీ లోటులేదు సుమండీ.

వీరయ్య తండ్రి తనకొడుకు చాలాచదువుకొన్నవాడని, ఇష్టంలేక ఇన్నాళ్లనుంచి పెళ్లిచేసుకోలేదని, ఇంకాఇంకా ఏవో ఉన్నవీలేనవి కబుర్లుచెప్పుతూ ఉండేవాడు. చుక్కరాలింతంటే నమ్ముతారేమోగాని వీరయ్యకు పెళ్లికుదిరిందంటే ఎవరూనమ్మరు. కాని చుక్కరాలనూరాలింది; వీరయ్యకు పెండ్లి కుదరనూ కుదిరింది; నమ్మినవాళ్లు నమ్మండి; లేకపోతే ఊరుకోండి కాని, మీపుణ్యమాయిరి, మావీరయ్య పెండ్లికి అడ్డంరాకండి.

కొడుకు పెళ్లి కుదిరిందన్న సంతోషంకన్న పీటలమీద కూర్చోడానికి మన అబ్బాయికాళ్లు ఎలాస్వాధీనంలోకి వస్తాయా అని పట్టుకుంది వీరయ్య తల్లితండ్రులకు; గారాబం నష్టం యిప్పుడు తెలిసింది పాపంవాళ్లమ్మకీ నాయనకీన్నీ, అందుకని నెమ్మదిగా, కొడుకుకాళ్లకు, మోకాళ్లచిప్పలదగ్గిరా, తుంట్లదగ్గిరా, రోజుకు ఒకఅరవీశెడు ఆముదం రాచి, తోమి, రుద్ది, పులిమి, అంటి, వంచి, సాగదీసి, మళ్లీవంచి, మళ్లీసాగదీసి, నడు నడుంగా ఎముకలు పెటేలు, పెటేలు, మంటూవుంటే వీరయ్య అమ్మో, అమ్మో, అని అరుస్తూవుంటే ఎలాగైనా పీటమీద బాసిబొట్టు వేసుకొని కూర్చోడాన్ని అలవాటుచేయడానికి సాధనం చేస్తూ శతమతమౌతున్నాడు వీరయ్య తండ్రి. ఎలాగైతేనేం పెళ్లి నాటికి గంటసేపు ముడుచుకొని కూర్చోడానికి వచ్చేటట్లుగాచేసేడు, పెండ్లికి తరలివెళ్లేరు.

వీరయ్యకు ఎదురుగా అగ్నిహోత్రం వుంది, కుడివైపున పురోహితుడు, ఎడమవైపున పెండ్లికుమార్తె. ఇంకాచుట్టూ చాపలమీద పెండ్లిపెద్దలూ అంతా కూర్చున్నారు. పెండ్లిజరుగుతూ ఉంది. కాసేపైనతర్వాత వీరయ్య నెమ్మదిగా. విడె, విడె, విడె, అంటూ మొదలు పెట్టేడు. ఆసందట్లో యీమాట ఎవరూ వినిపించుకోలేదు. పురోహితుడు మాత్రం విని "అయ్యో! బాబో! ఈయన బాగాచదువుకొన్నాడు గాబోలు నేనుమంత్రంమధ్య వదలిపెట్టి చెప్పుతూన్న సంగతిని గ్రహించి "విడె, విడె, విడె, అంటున్నాడు. జాగ్రత్తగాఉండాలి అనుకొని సరిగా చెప్పుదామని నిశ్చయించుకుని సర్దుకుని కూర్చున్నాడు. యింతలో వీరయ్య పండ్లుబిగబట్టి, కండ్లుపెద్దవిచేసి, కొక్కచ్చినవాడిలాగ బిగ్గరగా విడె, విడె, విడె, అంటూ పురోహితుడి వంకా, ప్రక్కనేవున్న పెండ్లిపెద్ద వంకా కంగారుపడిచూస్తున్నాడు. పురోహితుడు భయపడి బిక్కమొగమేసుకొని పెండ్లికుమారుడికాళ్లవైపుకివంగేడు.

ఇంతలో వీరయ్య కాళ్లు కాస్తకాస్తే పట్టువదలి ఒక్కసారిగా విడి పెద్దశబ్దంతో రెండురెండువైపులకూ చాచుకున్నయ్. ఒకటి పురోహితుడికీ, రెండవది పెండ్లిపెద్దకీ తగలటంవల్ల వారువెల్లకిలా పడి మళ్ళీ లేచారు. పురోహితుడు మొండి ధైర్యం తెచ్చుకొని "వీరయ్యగారూ! తప్పంటే చెప్పాలిగాని తామసం తెచ్చుకొని తంతారుటండీ, ఎంతగొప్పవారైనాగాని" అన్నాడు ఇంతలో వీరయ్య తల్లితండ్రివచ్చి అతనికాళ్లు రెండుచేతులో పట్టుకుని మడిచి కూర్చో పెడ్తున్నారు "ఓసీపోవే! ఈబాదేంది నాకు; నానిలాగేకూకుంటా" సని వీరయ్య నిక్కచాచిన కాళ్లలో ఒకదాన్ని పెండ్లికూతురు వళ్లోను ఇంకోటి పురోహితుడి మెడమీద పెట్టి వెనుకనున్న స్తంభానికి ఆనుకొని దర్జాగా కూర్చున్నాడు అందరుఒక్కటే నవ్వటం.